


పని పిల్లలు కాదు..

- బాలలను పనిలో పెట్టుకోవడం నేరం
- 1986లో అమల్లోకి బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టం
- గత ఐదేళ్లలో 445 కేసులు నమోదు

నేడు బాల కార్మికత వ్యతిరేక దినం 7





తిరుమలాయపాలెం మండలం గోపాయిగూడెం పాఠశాల, పెచ్చులూడిన శ్లాబు

బడికి వేళాయె..

- రూ.కోట్లు వెచ్చించినా.. పూర్తి కాని అభివృద్ధి, మరమ్మతు పనులు
- సుందరీకరణ పనులదీ అదే పరిస్థితి
- సమస్యలతోనే స్వాగతం పలుకుతున్న పలు స్కూళ్లు

నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

ఖమ్మం ఖానాపురం హవేలి / కొత్తగూడెం అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు పూర్తయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. బడికి వేళయింది. సుమారు నెలన్నర రోజుల వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని చాలా పాఠశాలలు సమస్యలతోనే స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి, మరమ్మతు పనులు ఇంకా పూర్తికాలేదు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మొత్తం 1,527 ఉండగా వాటిలో 1,68,281 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 173మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, 4,854 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా విద్యాశాఖ ఏటా నిర్వహించే బడిబాటతో పాటు ఈసారి పలు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 6న ప్రారంభించిన బడిబాటను 19వతేదీ వరకు బడిబాట నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యా కమిటీలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామసభలు, బడిఈడు పిల్లల గుర్తింపు, ఇంటింటి ప్రచారాన్ని పూర్తి చేశారు. బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శిస్తూ, కరపత్రాలు పంచుతూ, ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, చిన్నారులకు అందే సౌకర్యాలు, ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభు త్వం విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను ఇప్పటికే అన్ని పాఠశాలలో సిద్ధం చేసి ఉంచారు. 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పాఠశాలలను అందంగా అలంకరించి.. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, (మిగతా 6వ పేజీలో)



బడి బస్సు భద్రమేనా?

- వాహనం రోడ్కెక్కాలంటే 'ఫిట్‌నెస్' తప్పనిసరి
- ఖమ్మం జిల్లాలో పరీక్షలు పూర్తయిన బస్సులు 529, భద్రాద్రి కొత్తగూడెంలో 149

7

'సన్నాల' బోనస్ కోసం..

ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లా రైతులు

- అందని యాసంగి పంట ప్రోత్సాహకం
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు
- మొత్తం 22,046 మంది రైతులు అర్హులు

ఖమ్మం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సన్నరకం వడ్ల సాగును ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగియగా.. రైతులు పంట బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఈసారి యాసంగి ధాన్యం ఆశాజనకంగా పండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ఎక్కువ ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. సుమారు 3లక్షల ఎకరాలపైగా వేసవిలో రైతులు ధాన్యం పండించారు. గతంలో ప్రైవేటు మిల్లర్లు అధిక ధరపెట్టి కొనుగోలు చేసే పరిస్థితి ఉండగా ఈసారి రైతులు అధికంగా సన్నరకాలు పండించారు. అంతేకాకుండా ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ ఇస్తుందన్న ఆశతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ఎక్కువగా విక్రయించారు. సన్నరకాలు క్వింటాకు రూ.2,320, సాధారణ రకం క్వింటాకు రూ.2,300 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే సన్నరకానికి రూ.500బోనస్‌తో కలిపి క్వింటాకు రూ.2820 ధర పలికింది. మొదట్లో మిల్లర్లతోపాటు లారీ రవాణా విషయంలో కొంత (మిగతా 6వ పేజీలో)



(ఫైల్)

భద్ర గిరీషుడికి ఘనంగా జ్యేష్ఠాభిషేకం

- పంచామృతాలతో ప్రత్యేక స్నపనం
- నేటినుంచి నిత్య కల్యాణాల పునరుద్ధరణ

భద్రాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్యకు బుధవారం జ్యేష్ఠాభిషేకాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ప్రతీ ఏటా దేవస్థానం ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు ఈ జ్యేష్ఠాభిషేక మహోత్సవాలను నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను మేళతాళాలతో నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం 81 కలశాలలో ఉన్న నదీ జలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. ఇదే సమయంలో తొలుత పంచామృతాలతో ప్రత్యేక స్నపనం, ఆ తర్వాత సహస్రధారాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి ప్రసాద నివేదన చేశారు. అలాగే జ్యేష్ఠాభిషేక హోమానికి పూర్ణాహుతి గావించారు. జ్యేష్ఠాభిషేక ఉత్సవాలకు మంగళవారం రాత్రి అంకురారోపణం గావించగా (మిగతా 6వ పేజీలో)



సహస్రధారతో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రేపు భద్రాద్రి జిల్లా స్థాయి జాబ్ మేళా

ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా స్థాయి జాబ్ మేళా శుక్రవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 100 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉదయం 10గంటలకు జరిగే ముఖాముఖికి 18 నుంచి 30సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. వీరి విద్యార్హత పదవ తరగతి, ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్ చదివి ఉండాలని అన్నారు. ఆసక్తి గలవారు తమ వెంట వారి సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎనిమిదేళ్లయినా.. పరిహారమేదీ?

- ఎదురుచూస్తున్న బీటీపీఎస్ భూ నిర్వాసితులు
- పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్న జెన్కో
- కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడం లేదంటూ ఆవేదన
- నిర్మాణం పూర్తవుతున్నా నోరుమెదపని అధికారులు



భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఇదే

మణుగూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి వెలుగులు పంచే భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి.. అక్కడి అన్నదాతలు రెండు పంటలు పండే సారవంతమైన భూములను ధారాదత్తం చేశారు. ఈ క్రమంలో సేకరణ సమయంలో అధికారులు అనేక హామీలు గుప్పించారు. పరిహారంతో పాటు అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు కూడా ఇస్తామని పేర్కొన్నారు. దాంతో తమ సాగు భూములు పోయినా పరిహారం, ఉపాధి దొరుకుతుందని చక్కగా పంటలు పండే సాగు భూములను రైతులు బీటీపీఎస్‌కు అప్పగించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసిత రైతులకు ఎంత భూమి పోయిన రూ.5,50లక్షలు, అర్హత కలిగి ఉంటే(18 సంవత్సరాలు నిండిన వారికి) ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. ఆ తర్వాత పంట భూములను స్వాధీనం చేసుకున్న జెన్కో యాజమాన్యం నిర్మాణం మొదలు పెట్టి ఎనిమిది సంవత్సారాలు కావొస్తోంది. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి పైగా పరిహారం అందగా.. 346 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వీరు గత ఏడేళ్లుగా అనేక ఆందోళనలు చేశారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దాంతో అప్పటి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జెన్కో సంస్థను ఒప్పించి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఇంకా అనేక మంది అర్హత కలిగిన నిర్వాసితులున్నా వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. దాంతో వారంతా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

1,100 ఎకరాల భూ సేకరణ

ప్లాంట్ నిర్మాణానికి మణుగూరు, పినపాక మండలాల సరిహద్దుల్లో సుమారు 1100 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం పంపిణీకి 2016లో శ్రీకారం చుట్టారు. మొదట్లో పరిహారం పంపిణీకి చొరవ చూపిన అధికారులు.. మధ్యలో పర్యావరణం అనుమతులు లేవంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) స్టేటస్కో ఇవ్వడంతో ప్లాంట్ పనులకు బ్రేక్ పడింది. దీంతో రెండేళ్ల పాటు పరిహారం పంపిణీ, ప్లాంట్ పనులు పూర్తిగా (మిగతా 6వ పేజీలో)



సాధారణ కుటుంబం నుంచి సీఎం స్థాయికి..

- స్వశక్తితో ఎదిగిన జలగం
- నేడు వెంగళరావు వర్ధంతి

6

రామయ్య భూముల్లో రేకుల షెడ్

- రాత్రికి రాత్రి వెలిసిన నిర్మాణం
- ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన దేవస్థానం సిబ్బంది
- అక్కడి వారు దౌర్జన్యం చేశారంటున్న ఆలయ వర్గాలు



షెడ్ వేసిన వారితో మాట్లాడుతున్న దేవస్థానం అధికారులు

భద్రాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన ఏపీలోని యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భూముల్లో రాత్రికి రాత్రి ఓ రేకులషెడ్ వెలసింది.ఏపీలో ఉన్న భూమిలో సర్వే నెం.21లో మూడు సెంట్ల స్థలంలో ఆక్రమణదారులు రాత్రికిరాత్రే ఆ రేకుల షెడ్‌ను నిర్మించినట్లు దేవస్థానం అధికారులకు సమాచారం అందింది. దీంతో దేవస్థానం సిబ్బంది బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లి రేకులషెడ్‌ను తొలగించాలని అక్కడివారికి సూచించిన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్షానికి చెందిన స్థానిక నాయకుడు చుట్టు పక్కల ప్రజలను రెచ్చగొట్టి రేకుల షెడ్ నిర్మాణానికి సహకరించారని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. తాము పశువుల కోసమే షెడ్ వేశామని స్థానికులు పేర్కొనగా ఈ విధంగా పక్కా నిర్మాణం చేపట్టడానికి తాము ఎంత మాత్రం ఒప్పుకునేది లేదని, వెంటనే తొలగించాలని దేవస్థానం సిబ్బంది స్పష్టం చేశారు. ఏపీ హైకోర్టు 2022 నవంబరు 7న దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని దీనిపై ఏపీ వానరసేన, భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో కోర్టు ధిక్కారం కేసు వేశామని దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ఉత్తర్వులు పెండింగులో ఉన్న క్రమంలో ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన దేవస్థానం సిబ్బంది విధులకు ఆటంకం కల్పిస్తూ దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడారని దేవస్థానం అధికారులు ఆరోపిస్తున్నారు. దేవస్థానం భూముల్లో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నా ఏపీ రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా చివరకు రేకుల షెడ్‌ను తామే తొలగిస్తామని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నట్టు దేవస్థానం వర్గాలు పేర్కొన్నాయి.

నక్సల్స్ అడ్డాలో మినీ రైస్‌మిల్స్

- రూ.50లక్షలతో 20గ్రామాల్లో ఏర్పాటు
- తొలిసారిగా భద్రాద్రి పోలీసుల ప్రయోగం
- రాళ్లాపురంలో మిషనరీని ప్రారంభించిన ఎస్పీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు



మినీ మిల్లును ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆదివాసీలను అభివృద్ధి వైపు నడిపించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. చర్ల మండలంలోని 20 వలస ఆదివాసీ గ్రామాల్లో మినీరైస్ మిల్లులను ప్రారంభించారు. ఇందుకోసం సుమారు 50లక్షల నిధులను ఖర్చు చేశారు. గురువారం చర్ల మండలంలోని రాళ్లాపురం గ్రామంలో మొదటి యూనిట్‌ను భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసల ఆదివాసీ గ్రామాల ఆదివాసీలకు కరివేద సాగు ఆధారమని, వచ్చిన ధాన్యాన్ని దంచుకుని అన్నంగా వండుకుంటారన్నారు. మరి కొంత మంది ఇతర మండలాలకు వెళ్లి వాటిని మిల్లు పట్టించుకుని వస్తారని తెలిపారు. దాంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చుతున్నారన్నారు. ఇకపై ఇలాంటి బాధలు లేకుండా తెలంగాణ పోలీస్ శాఖ మావోయిస్టు ప్రభావిత నిధులతో మినీ రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తోందన్నారు. ఆదివాసీలు ఎక్కడికి పోకుండా వారి ధాన్యాన్ని వారే బియ్యంగా మార్చు కోవచ్చునన్నారు. ప్రతీ గ్రామం మధ్యలో ఈ మిషన్ ఉంటుందని, ఎలాంటి నగదు చెల్లించకుండా వడ్లను బియ్యంగా, బియ్యాన్ని పిండిగా, మిర్చిని కారంగా పట్టుకోవచ్చన్నారు. ప్రతీ యూనిట్‌కు ఇందుకోసం రూ.2.50లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. గతంలో కూడా పలు గ్రామల్లో గానుగ మిల్లులు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఆదివాసీలకు భద్రాద్రి పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారని, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. యువత చెడు మార్గంలో పోకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు రాకుండా చూడాలని, అనుమానంగా ఉంటే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని సూచించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు కూడా లొంగిపోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో చదువుకుని క్రీడల్లో రాణిస్తున్న యువకుడు అడమయ్యను సన్మానించారు. అలాగే మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న పొడియం లక్ష్మి కుటుంబాన్ని ఎస్పీ పరామర్శించి.. వారికి దుస్తులు అందజేశారు. చర్ల మండలంలోని శాంతి భద్రతలు, ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ ముందున్నారని ఎస్పీ కొనియాడారు. ఎస్పీ పర్యటన నేపథ్యంలో స్పెషల్ పార్టీ, సీఆర్పీఎఫ్ బలగాలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశాయి. కాగా చర్ల అడవుల్లో ఎస్పీ రోహిత్ రాజ్ బుల్లెట్ బండిపై రయ్‌మంటూ తిరిగారు.

సాధారణ కుటుంబం నుంచి సీఎం స్థాయికి..

» స్వశక్తితో ఎదిగిన జలగం » నేడు వెంగళరావు వర్ధంతి

సత్తుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లో వచ్చి స్వశక్తితో అంచలంచెలుగా ఎదిగి.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి నుంచి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారు జలగం వెంగళరావు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆరో ముఖ్యమంత్రిగా పని చేశారు. నేడు జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా కథనం.

శ్రీకాకుళం జిల్లాలో జన్మించి....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా రాజాం సమీపంలోని సోపేరులో 1922 మే నాలుగో తేదీన జన్మించిన వెంగళరావుకు ఇద్దరు సోదరులు, ముగ్గురు సోదరీమణులున్నారు. వెంగళరావు తండ్రి కృష్ణా జిల్లాలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న కారణంగా ప్రాథమిక విద్యను కేసరిపల్లిలో చదివారు. గన్నవరం తాలూకా హైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన ఆయనకు కృష్ణా జిల్లా మాధవరానికి చెందిన మంగాయమ్మతో వివాహమైంది. అప్పటి వరంగల్ జిల్లా మధిర తాలూకాలో వెంగళరావు బంధువులకు కలప వ్యాపారం ఉండేది. ఈ వ్యాపారం కోసం వచ్చిన ఆయన ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు.

ఉద్యమం... రాజకీయ ప్రస్థానం...

స్థిరపడేందుకు సత్తుపల్లి ప్రాంతానికి వచ్చిన వెంగళరావు చిన్న వయస్సులోనే స్వామి రామానందతీర్థ నాయకుడిగా ఉన్న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ వైపుఆకర్షితులయ్యారు. ఆ తరువాత కాలంలో నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కీలకంగా వ్యహరించారు. సత్తుపల్లి నియోజకవర్గం నాయకులు తెలంగాణాకు సరిహద్దుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి, తిరువూరులలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన క్యాంపుల్లో నైజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. తిరువూరు క్యాంపునకు జలగం వెంగళరావు నాయకత్వం వహించి సాయుధపోరాటాన్ని కొనసాగించారు. సాయుధపోరాట ఉద్యమం సందర్భంగానూ, తెలంగాణ ప్రాంతంలో అమలవుతున్న కౌలుదారి చట్టానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో వెంగళరావు అరెస్టయ్యారు. నిజాం సంస్థానం భారత దేశంలో కలిసింది. అనంతరం 1952 నాటికి వెంగళరావు నాయకుడిగా ఎదిగారు. అప్పట్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీ చేయటం ద్వారా వెంగళరావు రాజకీయ ప్రస్థానం పూర్తి స్థాయిలో ప్రారంభమైంది.



1973లో ముఖ్యమంత్రి పదవి

జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తరువాత వెంగళరావు ముఖ్యమంత్రి పదవికి ఎంపికయ్యారు. 1973 డిసెంబర్ 10 వ తేదీ నుంచి 1978 మార్చి ఆరవ తేదీ వరకూ పని చేసారు. సామాన్య కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వెంగళరావు సీఎం అయ్యే వరకూ సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అనేక మంది అయనకు రాజకీయంగా అండదండలు అందించారు.

మొదటి సారి ఓటమి.. తరువాత విజయాలు

1952లో వేంసూరు కేంద్రంగా ఉన్న నియోజకవర్గం నుంచి జలగం వెంగళరావు స్వతంత్రంగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 1957లో ఆయన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో జలగం తన సోదరుడు జలగం కొండలరావును అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపించుకున్నారు. 1962, 1967, 1972, 1977లలో వరుసగా గెలుపొందారు. 1967లో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ పదవి వెంగళరావుకు రాజకీయంగా కలిసివచ్చిందని చెబుతారు. 1969-1971 కాసు బ్రహ్మానందరెడ్డి కేబినెట్‌లో హోం మంత్రిగా పని చేశారు. పీవీ నరసింహారావు కేబినెట్‌లో 1972-1973 పరిశ్రమల మంత్రిగా పని చేశారు.

సీఎంగా ఉమ్మడి ఏపీలో తనదైన ముద్ర

రాష్ట్ర ముఖ్యమంత్రిగా సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూనే రాష్ట్రంలో కూడా తన ముద్రను వేసారు. ఆయన హయాంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణాలో కాకతీయ యూనివర్శిటీ, కోస్తాఆంధ్రాలో ఆచార్య నాగార్జునా యూనివర్శిటీ, రాయలసీమ ప్రాంతంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్థాపితమయ్యాయి. 1975లో హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. వెంగళరావు హయాంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాటు, పోలీస్ శాఖ ప్రక్షాళన జరిగాయి. నాగార్జున సాగర్ ఎడమ కాలువనడు ఖమ్మం జిల్లాకు మళ్లించటంలో కీలక పాత్ర పోషించారు. తెలుగు సినీ పరిశ్రమ నిదొక్కుకునేందుకు ఆయన కృషి చేసారు. ఇందిరాగాంధీ దేశంలో అత్యయిక పరిస్థితి విధించిన సమయంలో వెంగళరావు మంచి పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకున్నప్పటికీ నక్సలైట్ల ఉద్యమాలను కఠినంగా అణిచివేయటంలో భాగంగా ఎన్‌కౌంటర్ల వ్యాప్తికి కారకులయ్యారనే విమర్శలు కూడా అప్పట్లో వెల్లువెత్తాయి.

కేంద్ర మంత్రిగా....

కాంగ్రెస్ పార్టీ చీలిపోయి కాంగ్రెస్ (ఐ) ఏర్పడిన సమయంలో వెంగళరావు కొంత కాలం పార్టీకి దూరమయ్యారు. 1984లో ఆయన పార్టీలోకి వచ్చి 1984, 1989 లలో ఖమ్మం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1986 నుంచి 1989 వరకూ రాజీవ్ గాంధీ కేబినేట్‌లో భారీ పరిశ్రమ శాఖా మంత్రిగా పదవీ నిర్వహించారు.

1999 జూన్ 12న కన్నుమూత

డీసీసీ, పీసీసీ పదవులతో పాటు రాష్ట్రంలో, కేంద్రంలో కీలక పదవులు నిర్వహించిన జలగం వెంగళరావు జూన్ 12 1999లో మృతి చెందారు. ఆయన వర్ధంతిని ఆయన అనుచరులు ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు.

ఎంకామ్‌లో ప్రనూషకు రెండు బంగారు పతకాలు

» జూలై 7న జరిగే స్నాతకోత్సవంలో అందజేత

» విద్యార్థిని సన్మానించిన కళాశాల అధ్యాపక బృందం



ప్రనూషను సన్మానిస్తున్న అధ్యాపకులు

భద్రాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంకామ్ చదివిన బానోత్ ప్రనూషకు కాకతీయ యూనివర్సిటీ స్థాయి లో రెండు బంగారు పతకాలు అందజేయనున్నారు. 2019-21 విద్యా సంవత్సరంలో ఎంకామ్ చదివిన ప్రనూష ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ పతకాలను ప్రకటిస్తూ ఇప్పటికే భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అధికారులకు అధికారిక సమాచారం అందింది. జూలై ఏడున వరంగల్‌లో జరిగే కేయూ 23వ స్నాతకోత్సవంలో ఈ బంగారు పతకాలను అందజేయనున్నారు. ఈ సందర్భంగా భద్రాచలంలోని డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, అధ్యాపక బృందం ప్రనూషను శాలువ, జ్ఞాపికతో బుధవారం ఘనంగా సన్మానించారు. కామర్స్ అధ్యాపకుల బోధన, విద్యార్థిని ప్రనూష ప్రతిభ వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. ఈ సమయంలో ఆమె తల్లిదండ్రులు అమర్‌సింగ్, కవితలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, కామర్స్ ఇన్‌చార్జి హవీలా, అకడమిక్ కోఆర్డినేటరు హిమజ, సీవోఈ డా.శ్రీను పాల్గొన్నారు.

కష్టాలను ఎదురీది...



తల్లిదండ్రులతో ప్రనూష

తల్లిదండ్రులు పడ్డ కష్టానికి.. పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ చిన్నతనం నుంచే చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ చాటుతూ ఎంకామ్ పూర్తి చేసి రెండు బంగారు పతకాలు సాధించింది. ఖమ్మంలో నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన బానోతు అమర్ సింగ్-కవితల రెండో కుమార్తె ప్రనూష చిన్ననాటి నుంచి చదువులో అందరికంటే మిన్నగా రాణించేది. కాగా తండ్రి ప్రైవేటు ట్రాక్టర్ షోరూంలో పని చేస్తుండగా బదిలీపై భద్రాచలం వచ్చారు. ఈ సమయంలోనే తండ్రి అనారోగ్యం బారిన పడి ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆర్థిక కష్టాలు వెంటాడటంతో ప్రనూష పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ప్రస్తుతం ఏపీలోని తిరువూరులో బీఈడీ చదువుతోంది.

ఆర్థిక సహకారం అందిస్తే సివిల్స్ రాయాలని ఉంది: బానోతు ప్రనూష.

సివిల్ సర్వీసెస్‌లో సేవలందించాలని ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో నేను తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నా. ఐటీడీఏ అధికారులు సహకారం అందిస్తే నేను అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తా.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణంలోని ఈవీఎం గోడౌన్‌ను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవీఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో లోపలికి వెళ్లారు. ఈవీఎం, వీవీ.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి, మాట్లాడుతూ, సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు పి.శ్రీనివాస్, టి.రవీందర్, ఆర్.ప్రకాష్, సతీష్ బాబు, కృష్ణప్రసాద్, గోపాల్‌రావు తదితరులు ఉన్నారు.

అదును చూసుకొని విత్తుకోవాలి

» జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

» ఏరువాక పౌర్ణమి సందర్భంగా క్షేత్ర సందర్శన

కూసుమంచి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో అదును, పదును చూసుకుని రైతులు విత్తనాలు విత్తుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య సూచించారు. కూసుమంచి రెవెన్యూ పరిధిలోని లోక్యాతండాలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పత్తి విత్తుతున్న వ్యవసాయక్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా భూమిలో తగిన తేమశాతం ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు పెట్టాలని సూచించారు. పొడిదుక్కుల్లో విత్తనాలు విత్తుకోవద్దన్నారు. పొడిదుక్కుల్లో పెట్టడం వల్ల మొలకెత్తక విత్తనాల ఖర్చు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కలుపు యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. బిల్లులు తప్పకుండా పొందాలని వాటిని భద్రపరుచుకోవాలని అన్నారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించిన పక్షంలో అట్టి డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు కానీ, వ్యవసాయ శాఖ అధికారులకుగానీ సమాచారం అందించాలని డీఏవో సూచించారు. గ్రామాల్లో సదస్సులు, అవగాహన సమావేశాలు నిర్వహిస్తు రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

పోలీసులతో కలిసి దుకాణాలు తనిఖీ

ఈ సందర్భంగా కూసుమంచిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పలు విత్తన దుకాణాలను డీఏవో తనిఖీలు నిర్వహించారు. విత్తన వ్యాపారులందరూ చట్టానికి లోబడి విత్తనాలు విక్రయించాలని, నిషేధిత విత్తనాలు విక్రయించిన పక్షంలో చర్యలు తీసుకుంటామని, రశీదులపై తప్పనిసరిగా రైతుల సంతకం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన బీటీ3 లేదా హెచ్‌టీ పత్తి విత్తనాలు అమ్మొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏవో వాణి, ఏఈవో ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో పత్తి విత్తనాలు వేస్తున్న వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య, ఏడీఏ సరిత

కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయ దంపతులు



కుమార్తెతో తల్లిదండ్రులు

ఇల్లెందురూరల్, జూన్11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి ఉపాధ్యాయ దంపతులు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్థులు అభినందిస్తున్నారు. ఇల్లెందు మండలం మసివాగు గ్రామానికి చెందిన ఊకే కృష్ణ-రామేశ్వరి దంపతులు ఇరువురు గుండాల మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఖమ్మంలో కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న తమ కుమార్తెను తమ సొంత గ్రామంలో ఉన్న ముత్తారపుకట్ట ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించి ప్రభుత్వ విద్యపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గ్రామంలో ఉన్న పాఠశాలలో మౌలిక వసతులు, విద్యాబోధన తమను ఎంతగానో ఆకట్టుకుందని, సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని అందుకే తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నామని వివరించారు. ఉపాధ్యాయ దంపతులు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ మంకిడి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు కబ్బాకుల రవి, ఆరెం రవికుమార్‌లు అభినందించారు.

బడికి వేళాయే..

(5వ పేజీ తరువాయి)

సముదాయ సభ్యులను ఆహ్వానించి పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలి. అలాగే 13న సామూహిక అక్షరాభ్యాసం, ఉన్నత పాఠశాల విద్యార్థులతో బాలసభ నిర్వహిస్తారు. 16న తొలి మెట్టు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఉంటుంది. 17న ప్రత్యేక అవసరాలు గల పిల్లల విషయంపై తగిన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18న బడి తోట పెంపకం, మొక్కలు నాటడంపై దృష్టి పెడతారు. మధ్యాహ్న భోజనానికి అవసరమైన విధంగా బడితోటను నిర్వహించేలా ఇప్పటికే పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అధికారులు మార్గదర్శనం చేశారు. ఇదిలా ఉంటే మే రెండో వారంలోనే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నేరుగా నోట్ పుస్తకాలను అందించింది. 4,92,970 వర్క్ పుస్తకాలు, 4,46,410 పాఠ్యపుస్తకాలు జిల్లా గోదాంకు చేరాయి. మొదటి జత యూనిఫామ్ క్లాత్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు చేరాయి. వాటిని ప్రధానోపాధ్యాయులతో గుర్తించిన స్వయం సహాయక బృందాల టైలర్లతో కుట్టించారు. రెండో జత యూనిఫామ్ క్లాత్ అన్ని మండలాలకు చేరగా కుట్టడానికి టైలర్లకు అందించారు.

బడుల్లో సమస్యలెన్నో..

బడులను తెరిచే నాటికి పాఠశాల్లో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి, మరమ్మతు, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయినా చాలా స్కూళ్లలో పనులు పూర్తికాలేదు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదుల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, కిటికీల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, గదులకు రంగులు వేయడం తదితర పనులతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ నిర్మాణ పనులు 85శాతం పూర్తవగా.. మిగిలిన 15 శాతం అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. మొత్తం 955 పాఠశాలల అభివృద్ధికి రూ. 35.14 కోట్లు నిధులు మంజూరవగా 898 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా వాటికి 80 శాతం నిధులు అందించారు. మిగిలిన 20 శాతం నిధులను డిడక్షన్ పేరుతో పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన 57 పాఠశాలల్లో కేవలం 50 శాతం పనులే పూర్తయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి పనుల తాలుకా రూ.10.4 కోట్ల రూపాయాలు పెండింగ్‌లో ఉండటంతో వాటికి సంభందించిన పనులు మధ్యలోనే ఆగాయి. పాఠశాలలు తెరిచే సమయానికే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామన్న అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీలకు శ్రీకారం చుట్టి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వేసవి సెలవుల్లో పనులు ప్రారంభించారు. కానీ ఖమ్మం జిల్లాలో అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదు. పనులు చేపట్టి నెలలు గడిచినా కేవలం 955 పాఠశాలలకు గాను 898 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి.

భద్రాద్రి జిల్లాలో మొక్కు'బడిబాట'

సర్కారీ బడుల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట, అమ్మ మాట.. అంగన్వాడీ బడిబాట కార్యక్రమాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నామమాత్రంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం కొరవడిందని ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలాఉంటే టీచర్ల నిర్లిప్తత కూడా ఇందుకు కారణమనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. డీఈవో, ఎంఈవోల ఇంచార్జ్ పాలనలతో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా బడిబాట ద్వారా ఒకటవ తరగతిలో నేటి వరకు చేర్పించిన వారి సంఖ్య 763, 2నుంచి 10వ తరగతిలో 184మందితో కలిపి మొత్తం 947మంది మాత్రమే అని అధికారిక సమాచారం. మరోవైపు 2నుంచి 7వరకు తరగతుల మధ్య బడి మానేసి రోజువారీ పనులకు వెళ్తున్న 34మంది పిల్లలను గతేడాది గుర్తించారు. వీళ్ల నేటివరకు ఏయే స్కూళ్లలో చేరతారన్న స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 1039లోకల్‌బాడీ, 28 రాష్ట్ర ప్రభుత్వం, 220ట్రైబల్ వేల్ఫేర్, 79 ఆశ్రమ పాఠశాలలు, 23 ఎయిడెడ్ స్కూల్స్, 14 కేజీబీవీ, 1 యుఆర్ఎస్, 174 ప్రైవేట్ పాఠశాలలు, 7 ఏకలవ్య పాఠశాల, 1 మిని గురుకులం, 8 ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, 8 సోషల్ వేల్ఫేర్ స్కూల్స్, 6 ముస్లీం మైనార్టీ, 11 బీసీ వేల్ఫేర్, 1 తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్, 1 సెంట్రల్ గవర్నమెంట్ స్కూల్, 4 సీబీఎస్ఈ స్కూల్స్, 1 సీడబ్ల్యూఎస్ఎన్ స్కూల్స్ తో కలిపి మొత్తం 1626 పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 1,54,138 మంది విద్యార్థులు హజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

భద్రగిరీషుడికి ఘనంగా జ్యేష్ఠాభిషేకం



(5వ పేజీ తరువాయి)

ఇందులో పాల్గొనే అర్చకస్వాములకు దీక్షా వస్త్రాలను అందజేశారు. ఇదే సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, నవకలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. దీంతో రెండు రోజుల పాటు నిర్వహించిన జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది గోపాలాచార్యులు, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జ్యేష్ఠాభిషేక వేడుక సందర్భంగా భద్రాద్రి రామయ్య బుధవారం జరిగే నిత్యకల్యాణాన్ని నిలిపేయగా గురువారం నుంచి పునరుద్ధరించనున్నారు.

‘సన్నాల’ బోనస్ కోసం..

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తడం, ఎగుమతి, దిగుమతి కూలీల కొరత ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యలు ఎదురయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన మిల్లులకు సీఎంఆర్‌కు అనుమతి రావడంతో సుమారు 50 మిల్లులకు పైగా ఖమ్మం జిల్లా నుంచి ఎగుమతి చేశారు. అయితే లావురకం ధాన్యం వరంగల్, హనుమకొండ మిల్లులకు వెళ్లింది. ఇక ఖమ్మం జిల్లా పరిధిలో 351 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేశారు. సహకార సంఘాల ద్వారా 162 కొనుగోలు కేంద్రాలు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల నుంచి 156, డీసీఎంఎస్ నుంచి 30, మెప్మా నుంచి 3 కొనుగోలు కేంద్రాలు మొత్తం 351 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించారు. మొత్తం 2,33,870 మెట్రిక్ టన్నుల రూ.540కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా రూ.522.47కోట్లు చెల్లించారు. ఇంకా రూ.19.79కోట్లు చెల్లించాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 145 కొనుగోలు కేంద్రాల ద్వారా 55,243 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. సుమారు రూ.127.80కోట్ల ధాన్యాన్ని రైతులు అమ్మగా.. ఇక్కడ రైతులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిగాయి.

బోనస్‌కు 22,046మంది రైతులు అర్హులు

ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో ప్రభుత్వం నుంచి బోనస్ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వానాకాలం వ్యవసాయ పనులు మొదలైన నేపథ్యంలో బోనస్ డబ్బులు కూడా వస్తే.. పెట్టుబడులకు కాస్త వెసులుబాటుగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఇరుజిల్లాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నవడ్లు పండించిన 22,046మంది రైతులు బోనస్‌కు అర్హులుగా ఉన్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో 16,654మంది రైతులకు సంబంధించి 11,46,928క్వింటాళ్లకు రూ.57కోట్ల34లక్షల64వేలు బోనస్ రావాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 5,392 మంది రైతులు అమ్మిన 36,951మెట్రిక్‌టన్నులకు సంబంధించి రూ.18.48కోట్లు బోనస్ చెల్లించాలి. అయితే ఇరుజిల్లాల్లో ఇప్పటి వరకు రైతులకు బోనస్‌సొమ్ము ఎక్కడా జమకాలేదు. ధాన్యం ధర చొప్పున సొమ్ములు మాత్రమే జమయ్యాయి. బోనస్ త్వరలోనే పడుతుందని అధికారులు రైతులకు చెబుతుండటంతో.. అవి ఎప్పుడొస్తాయా అన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

దూసుకువచ్చిన లారీ.. తప్పిన ప్రాణాపాయం

అశ్వారావుపేట రూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకు వైపునకు లారీ వేగంగా దూసుకురాగా తృటిలో ప్రాణాపాయం తప్పిన సంఘటన మండలంలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట వైపు నుంచి భద్రాచలం వైపునకు వెళుతున్న లారీ వినాయకపురంలో గల పెట్రోల్ బంక్ వద్దకు దూసుకువచ్చింది. అదే సమయంలో ఓ ద్విచక్రవాహనరుడు పెట్రోల్ పోయించుకుని కొంచెం ముందుకు వచ్చి బయలుదేరటానికి సిద్దమయ్యారు. లారీ ద్విచక్ర వాహనంపైకి ఒక్కసారిగా దూసుకురావటంతో వాహనంపై ఉన్న వ్యక్తి క్షణాల్లో వాహనాన్ని వదిలి పక్కకు దూకేశాడు. ఏమాత్రం ఆలస్యం అయినా నిండుప్రాణం లారీ చక్రాల కింద నలిగిపోయేది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది. వేగంగా దూసుకువచ్చిన లారీ పెట్రోల్ బంక్ వద్ద గల దిమ్మెను ఢీకొట్టి ఆగిపోయింది. లారీ ముందుకు వెళితే బంక్ పూర్తిగా ధ్వంసం అయ్యేదని నిర్వాహకులు తెలిపారు.

ఎనిమిదేళ్లయినా.. పరిహారమేదీ?

(5వ పేజీ తరువాయి)

నిలిచిపోయాయి. మొదట్లో ఉత్సాహం చూపిన అధికారులు ఎన్‌జీటీ నిర్ణయంతో కొంత నిర్లక్ష్యం వహించారు. ఇక కొందరు రెవెన్యూ అధికారులు చేతివాటం కారణంగా అర్హుల జాబితాలో పలువురి నిర్వాసితులు పేర్లు లేకపోవడంతో నేటికీ పరిహారం అందక కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. 'నాడు అధికారులు ఎలా చేశారో ఏమో.. ఇప్పుడు మనకెందుకులే' అన్నట్టుగా రెవెన్యూ, జెన్కో అధికారులు మిన్నకుండి పోవడంతో నిర్వాసిత రైతులకు న్యాయం జరగడం లేదు. కొందరు రెవెన్యూ, సివిల్ కోర్టులను ఆశ్రయించినప్పటికి ఏళ్లు గడుస్తున్నా న్యాయం జరగటం లేదని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న భూమి పోయి పరిహారం అందక గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని కన్నీటి పర్యంతమవుతున్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో.. బీటీపీఎస్ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని, వేల కోట్ల దుర్వినియోగం జరిగిందని, నిర్వాసితుల సొమ్మును కాజేశారంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్దలు ఆరోపణలు చేస్తున్నారని ఆ దిశగా విచారించి తమకు న్యాయం జరిగేలా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ఎకరం 20గుంటల భూమి పోయింది
పుగాకు సత్యవతి, మణుగూరు

మా పుట్టింటి వారు పసుపు కుంకుమ కింద ఇచ్చిన 1:20 గుంటల భూమి ప్లాంట్ నిర్మాణంలో పోయింది. నా భూమి రెవెన్యూ రికార్డులో కూడా ఉంది. అధికారుల చుట్టూ తిరిగినా పరిహారం అందలేదు. ఉన్న భూమి పోయి నిర్వాసితులుగా మిగిలాం. కలెక్టర్ సారు స్పందించి ఆదుకోవాలి.

మాకు న్యాయం చేయండి
వీరరాఘవులు, దమ్మక్కపేట

ప్లాంట్ నిర్మాణంలో మూడు ఎకరాల భూమి తీసుకున్నారు. కుటుంబంలో నలుగురు ఉన్నప్పటికీ ఒకే ప్యాకేజీ ఇచ్చారు. కార్యాలయాలు చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

అధికారులు దృష్టికి తీసుకెళ్లాం
నగేష్, మణుగూరు తహసీల్దార్

తాము బీటీపీఎస్ నిర్వాసితులమని, తమకు పరిహారం అందలేదని కొందరు దరఖాస్తులు చేసుకున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

ఆర్థిక భరోసా కల్పించాలన్నదే లక్ష్యం

» సింగరేణి సీఎండీ బలరాం » పీఎన్‌బీతో ప్రమాద బీమా ఒప్పందం

రుద్రంపూర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనల మేరకు ఇప్పటికే కోటి రూపాయాల ప్రమాదబీమా సౌకర్యాన్ని అమలుచేస్తున్నామని, సంక్షేమ ప్రయోజనాన్ని మరింత పెంచుతూ పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సింగరేణి సంస్థ కుదుర్చుకున్న రూ. 1.25కోట్ల ప్రమాదబీమా పథకం ఒక చారిత్రక ఘట్టమని సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్ బలరాం పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికి వారి కుటుంబాలకు మరింత భరోసా కల్పించాలన్న ఉద్దేశ్యంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాదబీమా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సింగరేణి సొరుగు సేవల ఉద్యోగుల కోసం రూ.40లక్షల ప్రమాదబీమా ఒప్పందాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు సీఈఓ అండ్ ఎండీ అశోక్‌చంద్ర మాట్లాడుతూ సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శ ప్రాయమన్నారు. సమావేశంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ ఎల్‌వి సూర్యనారయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్‌వి రాజశేఖర్‌రావు, పంజాబ్ నేషనల్ బ్యాంకు హైదారాబాద్ రీజనల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెం అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 3నుంచి ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ బుధవారంతో ముగిశాయని డీఈవో యం. వెంకటేశ్వరచారి తెలిపారు. జిల్లాలో ప్రశాంతంగా పరీక్షలు ముగిసేందుకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 2707మందికి గాను 2177మంది హజరుకాగా 530మంది గైర్హాజర్ అయ్యారని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు తెలిపారు.



ఖమ్మంలో వాహన పరీక్షలు చేస్తున్న ఎంవీఐ స్వర్ణలత

బడి బస్సు భద్రమేనా?

- వాహనం రోడ్డెక్కాలంటే 'ఫిట్‌నెస్' తప్పనిసరి
- ఖమ్మం జిల్లాలో పరీక్షలు పూర్తయిన బస్సులు 529, భద్రాద్రి కొత్తగూడెంలో 149

ఖమ్మం సంక్షేమవిభాగం/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి పల్లెల వరకు 98శాతం విద్యార్థులు బస్సుల ద్వారానే స్కూళ్లకు వెళుతున్నారు. కొన్ని పాఠశాలలు బస్సుల నిర్వాహణలో అప్రమత్తంగా ఉంటుండగా, మరికొందరు అశ్రద్ధగా ఉండటంతో బడి బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. రవాణా శాఖ అధికారులు బస్సులను పరిక్షించి ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాల్సి ఉంది.

ఫిట్‌నెస్‌కు తప్పనిసరి..

ఖమ్మం రవాణా ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 513 బస్సులకు గాను 189 బస్సులకు ఫిట్‌నెస్ కాలేదు. వైరా ప్రాంతీయ కార్యాలయం పరిదిలో 134 బస్సులకు 45 బస్సులు, సత్తుపల్లి ప్రాంతీయ కార్యాలయంలో 153 బస్సులకు 37 బస్సులు ఫిట్‌నెస్‌కు రాలేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 800 బడి బస్సులు నమోదు కాగా వాటిలో 271 బస్సులు ఫిట్‌నెస్‌కు నోచుకోలేదు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 356 బస్సులు ఉండగా వాటిలో ఫిట్ నెస్ పొందినవి కేవలం 149 బస్‌లే ఉన్నాయి. మిగతా 207 బస్సులు ఫిట్‌నెస్‌కు రాలేదు. జిల్లాలో 84 పాఠశాల బస్సులు కాలం చెల్లినవిగా (15 సంవత్సరాలు దాటిన) రవాణా శాఖ అధికారులు గుర్తించారు.

29అంశాలు పరిశీలన

బడి బస్సుల భద్రత ప్రమాదాలు జరగకుండా జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రతి బస్సుకు 29అంశాలను స్వయంగా పరిశీలిస్తారు. బస్సు రిజిస్ట్రేషన్ నుంచి బ్రేక్ లైట్ వరకు వాహనం నాణ్యతలను పరిశీలిస్తారు. బస్సుకు బ్రేక్‌లు, డ్రమ్ములు, సీటింగ్, అత్యవసర తలుపులు, టైర్ల కండిషన్, తలుపుల తాళాలు, ఫైర్ సేఫ్టీ, ప్రమాద చికిత్స బాక్స్, మెట్లు, గ్రిల్స్, వాహనానికి ముందు తెలుపు, పక్కన పసుపు, వెనుక భాగంలో ఏరుపు స్టిక్కరింగ్ నుంచి డ్రైవర్‌కు ఐదేళ్ల కనీస అనుభవం, 60ఏళ్ల లోపు వయస్సును రవాణా శాఖ అధికారులు పరిశీలిస్తారు.



ఫిట్‌నెస్ లేకుంటే సీజ్..

వాకదాని వెంకటరమణ, ఇన్‌చార్జ్ జిల్లా రవాణా అధికారి, ఖమ్మం

ప్రభుత్వ బడుల ప్రారంభం నాటికే బడి బస్సులు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు పొందాలి. ఆ తర్వాతనే రోడ్డెక్కి విద్యార్థులను తరలించాలి. జిల్లాలో మరో 270 బస్సులు ఫిట్‌నెస్‌కు రాలేదు. వాటిపై ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ గురువారం నుంచి చేపడ్తున్నాం.

పోడు సాగుదారులపై కేసు నమోదు

దుమ్ముగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గడ్డోరుగట్ట వివాదాస్పద పదిహేడు హెక్టార్ల పోడు భూములకు కందకాలు తీసే క్రమంలో బుధవారం అటవీశాఖ, పోడుసాగుదారుల మధ్య వివాదం చోటుచేసుకోగా, ఇద్దరు పోడుసాగుదారులపై దుమ్ముగూడెం అటవీశాఖ అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. వివాదస్పద అటవీ భూములకు రక్షణగా అటవీశాఖ ఎక్స్‌కవేటర్‌తో కందకం తీసే పనులను చేపట్టింది. పనులు జరగకుండా కొందరు పోడుసాగుదారులు బుధవారం యంత్రానికి అడ్డుపడ్డారు. పనులను అడ్డుకోవడం చట్టవ్యతిరేకమని ఎఫ్‌డీఓ సుజాత, సీఐ అశోక్‌లు పోడుసాగుదారులకు అవగాహన కలిగించినా, ప్రయోజనం కలగలేదు. దీంతో ఇదరు పోడుసాగుదారులపై కేసు నమోదు చేసి భద్రాచలం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

128 మందికి జరిమానా

కొత్తగూడెం లీగల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం కోర్టులో మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులలో 128 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బుధవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం-1వ టౌన్ ఎస్ఐ తంగ రాకేష్, జి.విజయల కథనం ప్రకారం.. వాహనాలు నడుపుతుండగా నలుగురిని ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం తాగినట్టు రుజువు అయింది. అదే విధంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో-10 మందిని, టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ అప్పటి రమేష్‌కుమార్, సెల్వరాజ్‌ల వాహన తనిఖీలో-3, అదే విధంగా కొత్తగూడెం త్రీ టౌన్ ఎస్ఐ పురుషొత్తం ఆధ్వర్యంలో-12 మందిని, సుజాతనగర్ ఎస్‌హెచ్‌ఓ రమాదేవి ఆధ్వర్యంలో-26 మందిని, పాల్వంచ రూరల్ ఎస్ఐ బి.నరేష్ ఆధ్వర్యంలో -15 మందిని, చంద్రుగొండ ఎస్‌హెచ్‌ఓ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో-10 మందిని, చుంచుపల్లి ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ ఆధ్వర్యంలో-20 మందిని, ములకలపల్లి ఎస్‌హెచ్‌ఓ కిన్నెర రాజశేఖర్ ఆధ్వర్యంలో-30 మందిని కలిపి మొత్తం 128 మంది వాహనాలు నడుపుతుండగా ఆపి బీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం తాగినట్టు రుజువు కాగా కోర్టులో ప్రవేశపెట్టార. మెజిస్ట్రేట్ వారికి జరిమానా విధించగా వారు చెల్లించారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన లారీ

● ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు


వైరా, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రధాన రహదారిలో వైరా నది హైలెవల్ వంతెనపై జరుగుతున్న మరమ్మతుల వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. దాంతో బస్సులోని ముగ్గురు ప్రయాణీకులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అదే సమయంలో తల్లాడ వైపు వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వాహనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. ఎస్ఐ పి.రామారావు అక్కడకు చేరుకొని నిలిచిపోయిన వాహనాల రాకపోకలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆతర్వాత కలెక్టర్ కారు అక్కడి నుంచి తల్లాడ వెళ్లిపోయింది.

కరకగూడెంలో ముగ్గురికి గాయాలు..

కరకగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్ళవాగు ప్రధాన రహదారిపై బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురు ఎదురుగా ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలం పద్మాపురం గ్రామానికి చెందిన గొగ్గలి రాజు, గోవిందాపురం గ్రామానికి చెందిన గొగ్గలి రాంబాబులకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు రాళ్లవాగు ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురితో పాటు రాంబాబు భార్య అనసూర్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనారోగ్యంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనుముల వరప్రసాద్ (42) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. 2006 నుంచి ఇమ్యునైజేషన్‌విభాగంలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీం లో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వరప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.



పని పిల్లలు కాదు.. పసి పిల్లలు

- బాలలను పనిలో పెట్టుకోవడం నేరం
- 1986లో అమల్లోకి బాల కార్మిక చట్టం
- గత ఐదేళ్లలో 445 కేసులు నమోదు
- నేడు బాల కార్మికత వ్యతిరేక దినం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్11(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు అనేది నానుడి. అలాంటి బాలలు పనిలో మగ్గకుండా ఉండేందుకు ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చింది. చదువుకోవాల్సిన వయసులో కార్ఖానాల్లో మగ్గనివ్వకుండా చట్టాన్ని అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం బాల కార్మికుల శ్రేయస్సు కోసం 1986లో బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టాన్ని తీసుకురాగా. ఏటా జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ పనులు చేయించొద్దు

దుకాణాలు, వ్యాపార సంస్థలు, కర్మాగారాలు, వ్యవసాయ పనులు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా హాళ్లు, ఇతర ప్రజా వినోద సంబంధ విభాగాల్లో పనిచేసే బాలలకు ఈ చట్టం వర్తిస్తుంది. నాలుగేళ్లలోపు పిల్లలను ఫ్యాక్టరీలు, గనులు, ఇటుక బట్టీలు, ప్రమాదకరమైన ఇతర ప్రదేశాల్లో పనికి నియమించకూడదని చట్టం చెబుతోంది. బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం రైల్వే స్టేషన్లు, రైళ్లలో పనిచేయడం, టపాకాయలు అమ్మే దుకాణాలు, కబేళాల్లోనే కాక బీడీ, సిమెంట్, దుస్తుల డైయింగ్, సబ్బుల తయారీ పరిశ్రమల్లో పని, ఉన్ని దుస్తులను శుభ్రం చేయడం వంటి పనులకు వినియోగించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. 18 ఏళ్లలోపు వారు చదువుకోవాల్సిన వయసులో శారీరకంగా, సామాజికంగా, నైతికంగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. బాల కార్మికులు రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల మధ్య పనిచేయడం, ఓవర్‌టైమ్ చేయడంపై నిషేధం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించవచ్చు. జనవరి, జూలై మాసాలలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరులతో అధికారులు బాల కార్మిలను గుర్తించి వారిని పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదుచేస్తుంటారు. మిగిలిన 10నెలలు బాల కార్మికులను పట్టించుకునే అధికారి కాని, సంస్థలు కాని ముందుకు రావు.

ఏటా కేసుల నమోదు

రకరకాల కారణాలతో ఎందరో బాలలు ఆటపాటలు, చదువుకు దూరంగా ఉంటున్నారు. బాల కార్మికులుగా పని చేస్తూ ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లో గత ఐదు సంవత్సరాలుగా నమోదైన కేసుల వివరాలు.. 2021వ సంవత్సరంలో స్మైల్‌లో 60, ముస్కాన్‌లో 66 కేసులు నమోదు చేశారు. 2022లో స్మైల్‌లో 37, ముస్కాన్‌లో 68, 2023లో స్మైల్‌లో 30, ముస్కాన్‌లో 38, 2024లో స్మైల్‌లో 46, ముస్కాన్‌లో 49, 2025వ సంవత్సరంలో ఆపరేషన్ స్మైల్‌లో 51 కేసులు నమోదైనట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.

సమయస్ఫూర్తిగా విపత్తులను ఎదుర్కోవాలి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమయస్ఫూర్తిగా విపత్తులను ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యుడు ఆర్. మాధిలేటి అన్నారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆపద మిత్రలకు విపత్తులు ఎదుర్కోవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న వనరులతో ఏ విధంగా బయటపడవచ్చు, సీపీఆర్ వంటి అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలి

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కేంద్రం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఈ సందర్భంగా మహిళాసంక్షేమ శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆదనపు కలెక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసే ఫిర్యాదుల స్వీకరణ పెట్టెలను పరిశీలించారు.

సర్వే జరిపే వరకు కౌలు వేలం వద్దు

- రైతుల ఆందోళనతో వెనక్కి తగ్గిన అధికారులు

నేలకొండపల్లి, జూన్11 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని శ్రీరాజగోపాల స్వామి దేవాలయానికున్న 13.25 ఎకరాల భూమి బహిరంగ కౌలు వేలం తిరిగి వాయిదా పడింది. గత నెల 31న కౌలు వేలం నిర్వహించటానికి ప్రయత్నం చేయగా రైతులు అడ్డం తిరగటంతో అధికారులు కౌలు వేలం ఈనెల11కు వాయిదా వేశారు. తిరిగి 11వ తేదీ బుధవారం దేవాలయ ఆవరణలో కౌలు వేలం నిర్వహించటానికి ప్రయత్నం చేయగా కౌలు వేలంలో పాల్గొనటానికి వచ్చినరైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. 162, 163, 164, 185, 186 సర్వే నెంబర్లలో ఉన్న 13ఎకరాల 25కుంటల భూమిలో కొంత భూమి ఆక్రమణకు గురైందని రైతులు ఆరోపించారు. సరైన సమాధానం చెప్పాకనే కౌలు వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖాధికారులు నచ్చచెప్పటానికి ప్రయత్నించినప్పటికీ రైతులు ససేమిరా అన్నారు. దీంతో గత్యంతరం లేక అధికారులు కౌలు వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సాధ్యమైనంత త్వరగా సర్వే చేయించిన తర్వాతనే కౌలు వేలం నిర్వహిస్తామని ఈవో శ్రీకాంత్ హామీ ఇవ్వటంతో రైతులు శాంతించారు

రూ. 2లక్షల బీమా చెక్కు అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యం వలన తల్లిదండ్రులను కోల్పోయిన ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి షేక్ షరీఫ్‌కు కళాశాల చైర్మన్ గుండాల. కృష్ణ రూ. 2లక్షల బీమా చెక్కును బుధవారం కళాశాలలో అందించారు. గత ఏడాది ముంచెత్తిన భారీ వర్షాలకు కూసుమంచి మండలం నాయకనగుడెం వద్ద షరీఫ్ తల్లిదండ్రులు మృతి చెందారు. విద్యార్థి చదువుకు ఇబ్బంది లేకుండా కళాశాల యాజమాన్యం నేషనల్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ. 2లక్షల అందించారు.



బడి గంట కొడుతున్న డీడబ్ల్యూవో

ప్రైవేటుకు దీటుగా అంగన్‌వాడీల్లో ఆంగ్ల విద్య

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మీడియం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఇండస్ట్రియల్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రం2లో బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడబ్ల్యూవో, సీడీపీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు.

అగ్రకులాల ఆధిపత్యం అంటూ అవాస్తవ వాదనలు

- అగ్ర కులాల అభ్యుదయ సేన అధ్యక్షుడు మందటి నరేష్‌చౌదరి

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఎప్పటికప్పుడు అగ్రకులాల ఆధిపత్యం అంటూ వాస్తవం లేని వాదనలను వాదనలను చేస్తూ సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని అగ్ర కులాల అభ్యదయ సేన అధ్యక్షుడు మందటి నరేష్‌చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వార్థం కోసం చేసే ఇటువంటి వాదనలను గుర్తించలేనంత అమాయకుల కాదు తెలంగాణ ప్రజలన్నారు. తెలంగాణను ఏ ఒక్క కులం పాలించటంలేదని అన్ని కులాల, మతాల ప్రజల తీర్పుతో నడుస్తున్న పరిపాలన ఉందని అందులో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, హిందువులు సహా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. వికాసం, ఉపాధి, అభివృద్ధి గురించి మాట్లాడాల్సిన సందర్భంలో కొంత మంది వారి స్వప్రయోజనాల కోసం కుల రాజకీయాలు చేస్తున్నారన్నారు. తెలంగాణకు అత్యంత ప్రమాదం ఏదైనా ఉందంటే అది కులాల వల్లో, మతాల వల్లో కాదు, సమాజాన్ని చీల్చి తమ రాజకీయ ఊపిరి కొనసాగించాలనుకునే విభజన వాదుల వల్లనే అని అన్నారు. తెలంగాణకు సమైక్యత, అభివృద్ధి, దార్శనిక నాయకత్వం అవసరం అన్నారు. అంతేకాని కుల, ఆధారిత గందరగోళం కాదన్నారు. తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో తమ ఓట్ల ద్వారా సరైనా సమాధానం చెబుతారన్నారు.

కేసీఆర్‌కు సంఘీభావంగా వెళ్లిన కందాళ

కూసుమంచి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో పాటు పాలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావంగా తరలివెళ్లారు. కూసుమంచి జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంటూరి శేఖర్, మండల నాయకులు మల్లీడు వెంకన్న, ఆసీఫ్ పాష తదితరులు ఉన్నారు. అనంతరం జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మూతబడిన పాఠశాలను విద్యార్థులతో కలిసి పునః ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం బాడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండల పరిధిలోని ఓబుల్ రావుబంజర గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గ్రామ ప్రజలు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. జిల్లాలో 1500 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయని వీటిలో మూతపడిన పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆంగ్ల భాష విద్య అందిస్తామన్నారు. మండలంలో మూతబడిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్ ఈ సందర్భంగా రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తూ సదరు చెక్కును ఆర్డీవో రాంజేద్రగౌడ్‌కు అందించారు. పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, పం పిణీ చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అంగన్‌వాడీలకు కావాల్సిన సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని ఐసీడీఎస్ అధికారి నిర్మలజ్యోతికి సూచించారు.

హెచ్‌ఎం సుధాకర్‌కు కలెక్టర్ అభినందన

మండల పరిధిలోని చెన్నూరులో గల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దంతాల సుధాకర్ తమ సొంత ఖర్చులతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బడిబాట ప్రచార కార్యక్రమాన్ని పలు ప్రాంతాల్లో చేపట్టారు. అమ్మఒడి ప్రభుత్వ బడి, మీ పిల్లలను మీ ఊరి ప్రభుత్వ బడిలోనే చేర్పించండి అనే నినాదంతో విన్నూత్న రీతిలో వాహనంపై పలు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న సుధాకర్ సంకల్పానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ, ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్, సీడీపీవో నిర్మల జ్యోతి, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సాంబశివుడు, ఎంఈఓ నివేదిత, సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

- కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్



సమీక్షలో పాల్గొన్న సంజీత్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజలతో కలిసి ప్రధానమంత్రి కృషి సంచయి యోజన (పీఎంకేఎస్‌వై), జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ప్రాజెక్టులపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 7 లక్షల 70 వేల ఎకరాల వ్యవసాయ భూమికి గాను, 4.5 లక్షల ఎకరాలకు నీటిపారుదల వ్యవస్థ కింద ఆయకట్టు ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గత ఏడాది 5 వేల ఎకరాల నుంచి 35 వేల ఎకరాలకు పెరిగిందని, జిల్లాలో 3 ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖమ్మం జిల్లాలో స్టోరేజ్ వాటర్ లేవని, కేవలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆయకట్టు స్థిరీకరణకు, కొత్త ఆయకట్టు సృష్టించేందుకు ప్రస్తుతం గోదావరిపై సీతారామ ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సీజీడబ్ల్యూబీ టెక్నికల్ అధికారి టి. మాధవ్, సీడబ్ల్యూసీ. టెక్నికల్ అధికారి రూపేష్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ డీవీ. రమేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్. శివధర్మ తేజ, మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్ రెడ్డి, జడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

జూలూరుపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మూడున్నర సెంటీమీటర్ల(36.8మిల్లీమీటర్ల) వర్షపాతం నమోదైంది. మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో బొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది. అతని ఇంట్లోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. అదే విధంగా అతని ఇంటి సమీపంలోని 10 మంది ఇళ్లల్లోని సీలింగ్ ఫ్యాన్లుతో పాటు ఒకరి ఇంట్లో ఏసీ కాలిపోయాయి. పిడుగు పాటు శబ్దానికి వెంకటేశ్వరరావు భార్య శిల్ప స్పృహతప్పి పడిపోయింది. ఆర్ఐ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణలు సంఘటన స్థలాన్ని సందర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కల్లూరులో రూ.3లక్షల మేర ఆస్తి నష్టం

కల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పిడుగుపాటుతో హైపవర్ విద్యుత్ సరఫరాతో ఓ పాస్టర్ నివాస గృహంలో విద్యుత్‌ప్రమాదంతో రూ.2 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులు విలువైన సామాగ్రి దగ్ధమయ్యాయి. పలు ఇళ్లల్లో కూడా మరో లక్ష రూపాయల విలువ గల ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. దీంతో పాటుగా కల్లూరు, బత్తుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల రూ.2 లక్షల విలువ గల రెండు టాన్స్‌పార్మర్లు దగ్ధమయ్యాయి. తమ ప్రాంతంలో హైపర్ విద్యుత్ సరఫరా కాకుండా నివారించేలా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విజయ్‌నగర్ కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు. పిడుగుపాటుతోనే హైపర్ విద్యుత్ సరఫరా అయిందని ఏఈ వెంకట్ తెలిపారు.



దగ్ధమైన ఏసీ, బీరువా

ప్రభుత్వాలవి రైతు వ్యతిరేక విధానాలు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన కూడా రైతాంగ సమస్యలు మాత్రం మారలేదని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యకమిటీ సభ్యులు, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. వేసవి సమయంలోనే వర్షాలు పడటంతో రైతాంగం కోటి ఆశలతో సాగు ప్రారంభించారని కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం రైతాంగానికి వ్యవసాయ చేయూత ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో రైతులకు ఎటువంటి ప్రయోజనం చేయలేదన్నారు. ఎన్నో హామిలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతులను ఆదుకోవటం లేదన్నారు. జిల్లా మహాసభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగయ్య మాట్లాడుతూ ప్రణాళిక నిబంధనలు వివరించారు. సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయవ్యతిరేక విధానాలను సమాజం తిప్పికోట్టాలని పిలుపునిచ్చారు. మహాసభలో 18అంశాలను తీర్మాణించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావుతో పాటుగా మరో 18మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



విద్యుత్‌శాఖ ఫోన్ నెంబర్ల ప్రదర్శన

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఫోన్ నెంబర్లను బహిరంగపరిచారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విద్యుత్ ఇనియోగదారులకు ఫిర్యాదు కష్టాలు' కథనంపై జిల్లా పర్యవేక్షక ఇంజనీరు ఇనుగుర్తి శ్రీనివాసాచారి స్పందించారు. డివిజన్, సబ్ డివిజన్ నుంచి విద్యుత్ ఉపకేంద్రాలల్లోని గ్రామ స్థాయిలోని ఏఈఈల వరకు కొత్త ఫోన్ నెంబర్ల జాబితాలను విడుదల చేశారు. పట్టణాల నుంచి గ్రామీణప్రాంతాల వరకు వాట్సాప్ గ్రూప్‌లో మీడియా గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. దీంతో విద్యుత్ ఉద్యోగుల ఫోన్ నెంబర్లు వినియోగదారుల చేరువలోకి వెళ్తున్నాయి.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸ టేకులపల్లి సహకార సంఘం వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని విజయలక్ష్మి

ఖమ్మం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి సొసైటీ వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని విజయలక్ష్మి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు మంజూరైన సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కులను విజయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు తమ్మినేని కోటేశ్వరరావు, కమలమ్మ, వెంకన్న, నాగయ్య, మర్రి బాబు సన్మతి రావు, ఉపేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు యోగాడే ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమమానికి రావాల్సిందిగా ఆయూష్ అధికారులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆహ్వానించారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయిని కలసి యోగాడేకు హాజరుకావాల్సిందిగా ఆహ్వానించారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో పద్మావతి, దసరథ, కనకలక్ష్మి, ఎస్ ప్రకాష్, బాబు, ప్రైవేటు యోగా ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

బీటీ-3 విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కామేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బీటీ-3 విత్తనాలను విక్రయించినా, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం డివిజన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు అన్నారు. కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం, శ్రీరాం నగర్ తండలో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తప్పకుండా విత్తనాల సంచుల మీద ఉన్న లేబుల్స్, లాట్స్ నెంబరు, తయారీ తేదీలు, ముగింపు తేదీలను చూసి కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో విత్తనాల బుకింగ్ కోసం తిరిగే వారి వద్ద నుంచి ఎటువంటి విత్తనాలు కొనుగోలు చేయారాదని తెలిపారు.

సదస్సుల్లో భారీగా దరఖాస్తులు

తిరుమలాయపాలెం, జూన్11(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో రెవెన్యూశాఖ ఏర్పాటుచేస్తున్న సదస్సులకు రైతులు భారీగా తమ సమస్యలపై దరఖాస్తు చేస్తున్నారు. తిప్పారెడ్డిగూడెం, సోలిపురం గ్రామాల్లో బుధవారం సదస్సులు నిర్వహించారు. తిప్పారెడ్డిగూడెంలో 41, సోలిపురంలో 62మంది దరఖాస్తు చేశారు. అధికారులు మాట్లాడుతూ తమ భూములకు సంబంధించిన దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిలయాలు... ఖమ్మం విద్యాలయాలు

ఖమ్మం.. విద్యా గుమ్మం



ఖమ్మం, జూలై11 (ఆంధ్రజ్యోతి): పునాది సరిగ్గా లేకపోతే ఎంత పెద్ద భవనం అయినా సరే నేలమట్టం కావాల్సిందే. అలాగే విద్యార్థి దశలో నేర్చుకున్న పాఠాలే ఆయా విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలబడానికి కారణాలుగా మిగులుతాయి. అలా ఖమ్మం జిల్లాలోని అత్యుత్తమ పాఠశాలలు పదుల సంఖ్యలోనే ఉండొచ్చు కానీ.. ఆయా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సాధించిన ర్యాంకులు మాత్రం వందల సంఖ్యలోనే ఉంటాయి.

రాష్ట్ర స్థాయి ర్యాంకులు

జిల్లాలోని విద్యాసంస్థలు ఎప్పటికప్పుడు ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ రాష్ట్రస్థాయిలో ర్యాంకులు స్వంతం చేసుకుంటున్నాయి. రాష్ట్రస్థాయి ప్రమాణాలకు ధీటుగా విద్యబోధన చేస్తూ.. రాష్ట్రంలోని ఎంతో గొప్పగా చెప్పుకొనే పాఠశాలలను సైతం ఢీకొట్టి నిలబడగలుగుతున్నాయి. విద్యావ్యవస్థలో ఎన్ని అవరోధాలను ఎదుర్కొన్నప్పటకీ తమదైన శైలిలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ గమ్యాన్ని చేరగలుగుతున్నాయి. విద్యార్థులు విజ్ఞానానికి అనుగుణంగా విద్యను నేర్పుతూ, దానికి తగిన మెళకువలు నేర్పుతూ వారు ఉన్నతశిఖరాలు చేరుకోడానికి పునాదులు వేస్తున్నాయి. చిన్ననాటి నుంచే ఆ పునాదుల్లో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్న ఎందరో విద్యార్థులు పలు కాంపిటేటివ్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించగలుగుతున్నారు. ఆ తర్వాత ఉద్యోగాల్లోనూ అత్యుత్తమ స్థానాల్లో నిలబడగలుగుతున్నారు. అలా నిలబడిన వారిలో జిల్లా నుంచి అత్యధికమంది విద్యార్థులు ఉండటం విశేషం. కాగా ఆయా విద్యాసంస్థలు తమ పాఠశాలల్లో అభ్యాసన చేసిన నాటినుంచి సదరు విద్యార్థులను అంటిపెట్టుకుని వారిని తమ లక్ష్యానికి పంపించాలనే లక్ష్యంతో పనిచేయడం విశేషం.

జాతీయ స్థాయిలో గుర్తింపు..

జిల్లాలోని విద్యా సంస్థలు వివిధ జాతీయ స్థాయి ఇనిస్టిట్యూషన్‌లలో సింగిల్ నెంబర్ ర్యాంకులు సాధించి సీట్లను కైవసం చేసుకుంటున్నాయి. ఈ మేరకు ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రాంగణాలలో బోధించే వారిని స్ఫూర్తిగా తీసుకుంటూ అత్యుత్తమ లెక్చర్లు ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. దీంతో దేశంలోని అన్ని అగ్రశ్రేణిలో ఉన్న విద్యా సంస్థల్లో ఖమ్మంలో చదివిన విద్యార్థులు తారసపడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఖమ్మంలో విద్యను అభ్యసించడం అంటే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడానికి, వాటిని సాకారం చేసుకోవడానికి తమ పిల్లలకు కావాల్సిన విజన్‌ను అందించడమే అని తల్లిదండ్రులు భావిస్తుండటం విశేషం.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ తెలిపారు. 2025-26 డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. గౌరవ వేతనంగా రూ. 23,400లు అందించటం జరుగుతుందని తెలిపారు. పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులతో పాటు అర్హత ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 19వ తేదీలోగా డైట్ కళాశాల టేకులపల్లిలో దరఖాస్తులను అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490002259 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

14 నుంచి టీజీ ఈసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈసెట్) 2025 ప్రవేశాల మొదటి విడత కౌన్సెలింగ్ స్లాట్ బుకింగ్ ఈనెల 14 నుంచి 18 వరకు నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని తెలిపారు. సీట్ల ప్రకటన ఈ నెల 25వ తేదీన ఉంటుందని తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక సహాయం

కామేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాసిత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులకు బాసిత్‌నగర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. మొదటి బహుమతిగా దారావత్ హరిణికి రూ.10వేలు, రెండో బహుమతిగా జర్పల రాజేస్ రూ.5వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు జాజిరి గిరిధర్ సింగ్, జర్పల సక్రాం, భద్రు, రాంకిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

కూసుమంచి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు తొలి రోజున అమ్మమాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల పైబడిన పిల్లలను గుర్తించి, ఇంటింటికీ తిరిగి తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. పాలు, గుడ్లు, ఒకపూట సంపూర్ణ పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రీస్కూల్ పుస్తకాలు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో ఇళ్లకు దగ్గరగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, పిల్లలు ఆయాలు జాగ్రత్తగా చూసుకుంటారని వివరించారు. అంగన్‌వాడీలకు పంపడం వల్ల చిన్నారులలో చైతన్యం వస్తుందని, చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని, కేంద్రాలు ఇంటిని మరిపిస్తాయని తెలిపారు.

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

» ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి మండ లం తుంబూరులో జరిగిన భూ భారతి గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలో భూ యజమానులలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ధరణి కారణంగా అనేక మంది తమ భూమి హక్కులు కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి భూ భారతి అ మలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామ సభలు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి వల్ల ప్రతి ఒక్కరి భూమి హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని కొమ్మేపల్లి కాలనీలో జరుగుతున్న పారిశుద్య పనులను ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు పరిశీలించారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మునిసిపల్ కమిషనర్ నరసింహ, తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేంసూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూభారతితోనే భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి సూచించారు. మండలంలోని లింగపాలెం గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్యరావు, ఎంపీడీవో రాజారావు, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వెల్ది జగన్మోహన్‌రావు, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, ఎర్రా సత్యనారాయణ, ఎండీ.ఫైజుద్దీన్, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, సురేష్, రెవెన్యూ సిబ్బంది మహేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కొత్త రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఖమ్మం ఆర్డీవో గరిడే నర్సింహారావు అన్నారు. ముదిగొండ మండలం మేడేపల్లి, పమ్మి గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భూభారతి చట్టం-2025పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, ఆర్ఐలు ప్రసన్నకుమార్, వహీదా సుల్తానా, రెవెన్యూ సిబ్బంది జ్యోతి, రవీంద్ర, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైరా, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని విప్పలమడక, పాలడుగు గ్రామాల్లో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో తహసీల్దార్ శ్రీనివాసరావు, నాయబ్ తహసీల్దార్ సీహెచ్.సురేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. గిర్దావర్‌లు రాజా విక్రమ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం రెవెన్యూ సదస్సులో రసాభాస.....

ఎర్రుపాలెం, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యావారిగూడెం, భీమవరం గ్రామాల్లో తహసల్దార్ ఉషాశారద అధ్యక్షతన భూ భారతి రెవెన్యూ సదస్సులు బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అయ్యవారిగూడెంలో 127, భీమవరంలో 194 దరఖాస్తులు రైతులు అందించినట్టు తహసీల్దార్ తెలిపారు. భీమవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరెడ్డి, తల్లపురెడ్డి వెంకటరెడ్డి తమ పొలాల్లో గట్టు తగాదాల సమస్యలను సదస్సుల్లో లేవనెత్తారు. ఈసందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఎం పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరగడంతో రెవెన్యూ సదస్సు రసాభాసాగా మారింది. తల్లపురెడ్డి వెంకటరెడ్డి తన పొలంలో తానులేని సమయంలో అక్రమంగా ఫెన్సింగ్ రాళ్లు వేశారని, సర్వేచేసిఫెన్సింగ్ రాళ్లను తొలిగించాలని కోరుతున్న సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకుంటున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించామని, సర్వే అధికారులు సర్వేకి రావట్లేదని తెలిపారు. తహసీల్దార్ జోక్యం చేసుకుని సర్వేచేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈకార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీష, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేజండ్లసాయి, నాయకులు అనుమోలు కృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, దివ్వెల వీరయ్య పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

» సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రశ్నించారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం డివిజన్ స్థాయి సీపీఎం శిక్షణా తరగతుల ముగింపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని ఆరోపించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఒక్క పరిశ్రమను కూడ తీసుకు రాలేదని దీనికి వారు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, మందా సైదులు, మురళి, పురుషోత్తం, పాపినేని రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

బోనకల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు భూమి, భుక్తి కోసం నిరంతరం పోరాటాలు చేసింది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధవారం జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ నాడు జమీందారి, పటేల్ వ్యవస్థల రద్దు కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాడాయని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించామన్నారు. పోరాట పటిమ గల పార్టీ చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన అవశ్యకత ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, దండి సురేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, ఏనుగు వెంకటేశ్వరరావు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, యంగల ఆనందరావు, ఆకేన పవన్, రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, జక్కుల రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ఏన్కూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ టీఓఎస్ఎస్ (2025-26) విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ లో ప్రవేశాలకు నేటినుండి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఆగస్టు 12వతేదీ చివరి గడువు అని తెలిపారు. వివరాలకు 95733 54994 నెంబరులో సంప్రదించాలని కోరారు.

జవాన్‌కు సన్మానం

కారేపల్లి, జూన్11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవెంకటసాయినగర్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ జారె రవికుమార్ ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన ఆపరేషన్ సింధుర్‌లో పాల్గొన్నారు. యుద్ధంలో పాల్గొని మంచి పేరు తెచ్చుకున్న రవికుమార్ సెలవుపై స్వగ్రామం వచ్చాడు. ఈసందర్భంగా కాలనీ వాసులంతా కలసి మంగళవారం రాత్రి జవాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీవెంకటసాయి నగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, ఈసం భాస్కర్, దనసరి సమ్మయ్య, పొందెం రాజు, చందావత్ నాగేశ్వరరావు, గుగులోత్ రాంబాబు, దుర్గయ్య, శంకర్, రామకృష్ణ, బొల్లు హనుమంతరావు, ఉండం సాంబశివరావు జోగా రామారావు, ఈశ్వర్, నాగేష్, శివ, వెంకన్న, రామారావు, కర్ల పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వైరా, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగాఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు అన్నారు. మునిసిపల్‌శాఖ ఆదేశాల మేరకు వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం వైరా మునిసిపాలిటీలోని పలుచోట్ల డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగును సిబ్బందితో కలిసి తొలగించి శుభ్రం చేశారు. .అలాగే పలుచోట్ల రోడ్ల వెంట గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు.

భగవద్గీత పోటీల్లో ప్రతిభ



బహుమతితో సునీత

వైరా, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ తొమ్మిదోవార్డు లీలాసుందరయ్యనగర్‌కు చెందిన దోనేపూడి సునీతకు భగవద్గీత పారాయణ పోటీల్లో మొదటి బహుమతి లభించింది. ఇటీవల శృంగేరీలో జరిగిన భగవద్గీత పోటీల్లో సునీత పాల్గొని ప్రతిభను కనపర్చి మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

రాజులపాలెం పాఠశాల పునఃప్రారంభం

ఏన్కూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): మూతపడిన రాజులపాలె ప్రాథమిక పాఠశాలను ఈనెల 12న తిరిగి పునఃప్రారంభిస్తున్నట్టు ఎంఈవో రహీంబీ తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటేషన్‌పై రాజులపాలెం పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. మండలంలోని 34ప్రాథమిక, 8యూపీఎస్, 8 హైస్కూల్‌లకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నిరుపేదల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న యర్రాబాబు

కొణిజర్ల, జూన్11(ఆంధ్రజ్యోతి): నిరంతరం నిరుపేద ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కాచారం గ్రామంలో బండారుపల్లి భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన శాఖా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదవాడికి కూడు, గూడు నినాదంతో దళితులు, గిరిజనులు బలహీన వార్గలు వారికి భూపోరాటాలు నిర్వహించి అనేక లక్షల ఎకరాలు భూమిలేని నిరుపేదలకు పంచిన ఘనత సీపీఐకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునిగే కోటేశ్వరరావు, మోదుగు చిన్నవెంకటి, నాగయ్య, రాములు, కన్నయ్య పాల్గొన్నారు.

రైతు భరోసాను వెంటనే అందించాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల,జూన్11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్నాయని, ప్రభుత్వం పెట్టుబడి సహాయంగా రైతు భోసా అందించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. బుధవారం మండల పరిధిలోని వైరా మునిసిపాలిటి పరిధి లాలాపురం గ్రామంలో జరుగుతున్న రైతు సదుస్సు వద్దకు రైతుసంఘం ఆధ్వర్యంలో వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ప్రభుత్వం వెంటనే రైతుభరోసా ఇవ్వాలన్నారు. నకిలి విత్తనాల సరఫరా పై కఠిన చర్యలు తీసుకోవాలని, రుణమాఫి పెడింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. గత సంవత్సరం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడం వలన ముఖ్యంగా మిర్చి సగం తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత సీజన్‌లో ప్రభుత్వం రైతు భరోసాను మూడు ఎకరాలలోపు వారికి మాత్రమే ఇచ్చిందని, నాలుగు ఎకరాలు పైగ ఉన్న రైతులుకు నేటికి రైతుభరోసా అందక రైతులు ఆందోళనపడుతున్నారని తెలిపారు. జిల్లాలో నకిలి విత్తనాల సరఫరా పెరిగిందని, ఆంధ్రప్రదేశ్ నుంచి పత్తి, మిర్చి విత్తనాలు సరఫరా అవుతున్నాయన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, సంక్రాంతి పురుషోత్తం, దామా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, సిద్దా, ఉషాకిరణ్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం



కుంచపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వేంసూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచపర్తి గ్రామంలో బుధవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, కేశవరావు, ఆషా, అంగన్‌వాడీ ఈచర్ రత్నకుమారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ఐ సూపర్‌వైజర్ భవాని తెలిపారు. బుధవారం ఏన్కూరు హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సుశీల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని అందించేందుకు తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ పెనుబల్లి సర్కిల్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె బుధవారం పెనుబల్లి నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు బిర్యానీ అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రెండో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఎన్.కృష్ణకుమారి, ఏఎన్ఎం కృష్ణకుమారి, ఆశకార్యకర్త తిరుపతమ్మ, ఆయా లక్ష్మి, పాల్గొన్నారు.



పెనుబల్లిలో సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు: ఏడీఏ



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర

మధిరరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయచంద్ర హెచ్చరించారు. బుధవారం మధిర పట్టణంలోని విత్తనాలు అమ్మే దుకాణాలను తనిఖీచేశారు. స్టాక్ రిజిస్టర్, ఫార్మర్‌సేల్ రిజిస్టర్ రశీదు పుస్తకాలు, ఇన్‌వాయిస్, జీవోటీలను పరిశీలించారు స్టాక్‌బోర్డు తప్పనిసరిగా పెట్టాలని, సంతకాలు చేయించుకోవాలని ఏడీఏ సూచించారు. రైతులు కూడా లైసెన్సు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొను గోలు చేయాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం అందింతే వ్యవసాయశాఖకు సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సాయిదీక్షిత్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అండర్-19 క్రికెట్‌కు ఆత్కూరు విద్యార్థి ఎంపిక



కిషన్‌రాజు

మధిరరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన పెరుమాల్లపల్లి కిషన్‌రాజు అనే పదోతరగతి విద్యార్థి అండర్-19 జిల్లా స్థాయి క్రికెట్‌కు ఎంపికయ్యాడు ఈనెల 9న ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-19 పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150మంది పాల్గొన్నారు. మధిర డివిజన్ నుంచి కిషన్‌రాజు బౌలింగ్‌లో అండర్-19కు ఎంపికయ్యాడు. ఈవిద్యార్థి గతంలో 2023లో అండర్-14 విభాగంలో క్రికెట్‌కు ఎంపికయ్యాడు. మధిర సమీపంలోని ఆత్కూరు శ్రీనిధి పాఠశాలలో చదివిన కిషన్‌రాజు అండర్ 19ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

టీపీసీసీ పదవుల్లో వైరాకు ప్రాధాన్యం

» భట్టి, రేణుక వర్గాలకు దక్కిన చోటు



కట్ల రంగారావు



నూతి సత్యనారాయణ

వైరా, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) కార్యవర్గంలో వైరా నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి వర్గీయులకు స్థానం లభించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గానికి ఈ నియోజకవర్గం నుంచి టీపీసీసీలో ప్రాతినిధ్యం లభించలేదు. భట్టి, రేణుక వర్గీయులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా చోటు లభించింది. భట్టి వర్గీయుడైన గౌడ సామాజిక వర్గానికి చెందిన నూతి సత్యనారాయణకు, రేణుకాచౌదరి వర్గీయుడైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన కట్ల రంగారావులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భట్టి వర్గీయుడైన నూతి సత్యనారాయణకు టీపీసీసీ కార్యదర్శి పదవి దక్కింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో సత్యనారాయణకు ప్రధాన కార్యదర్శి పదవి లభించింది. ఇకపోతే రేణుక వర్గీయుడైన కట్ల రంగారావు గతంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఉమ్మడి ఏపీలోనే పీసీసీ కార్యదర్శి పదవి దక్కింది ఇప్పుడు మళ్లీ రేణుక ఆశీస్సులతో ప్రధాన కార్యదర్శి పదవి లభించింది. ఇప్పటికే భట్టి వర్గీయుడైన వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణ(గౌడ) రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవిలో ఉన్నారు. ఇకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడైన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రస్థాయి పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారు. పొంగులేటి వెంట కాంగ్రెస్‌లో చేరిన రాజశేఖర్ నైతిక బాధ్యత వహిస్తూ అప్పట్లోనే మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు పాలకవర్గాలను నియమించిన సమయంలో బొర్రా తనకు పదవి వస్తుందని ఆశించినా ఫలితం దక్కలేదు. దాంతో తీవ్ర అసంతృప్తికి లోనైనప్పటికీ ఎక్కడా అది కన్పించకుండా పొంగులేటి వెంట వైరా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పుడు కనీసం టీపీసీసీ కార్యవర్గంలో ఈ నియోజకవర్గం నుంచి పొంగులేటి వర్గీయులు ఒక్కరికి కూడా అవకాశం లేకపోవడంతో ఆవర్గీయులు కొంత అసంతృప్తికి లోనయ్యారు. భట్టి, రేణుక వర్గీయులు మాత్రం సంబరాలు చేసుకుంటున్నారు.

రాజకీయ జోక్యం లేకుండా ఇళ్లు ఇవ్వాలి

కొణిజర్ల, జూన్10(ఆంధ్రజ్యోతి): పార్టీలకు సంబంధం లేకుండా గ్రామాలలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీవో రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తూము సుధాకర్, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, షేక్ అఫ్జల్, చింతపల్లి ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, బుర్రి గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో మోసపోవద్దు

కొణిజర్ల, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంది, దీనిని ఆసరా చేసుకొని ఎవరైనా డబ్బులు అడిగితే ఇచ్చి మోసపోవద్దని, అర్హులకు ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా వస్తుందని కొణిజర్ల ఎంపీడీవో రోజారాణి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో స్పష్టత ఉందని, ఇందిరమ్మ కమిటీల ద్వారా వచ్చిన వారి పేర్లను ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జిల్లా కలెక్టర్ ద్వారా నియమించిన గెజిటెడ్ అధికారులు ప్రత ఇంటికి వెళ్లి వారి ప్రస్తుత స్థితిని పరిశీలించి, లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరించి అర్హులకు మాత్రమే మంజూరు ఇవ్వడమయిందన్నారు. ఎవరైనా అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన్నట్లుయితే వారి మంజూరి ఏ స్టేజీలో ఉన్న రద్దు చేస్తామన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచండి

పెనుబల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నందున స్వచ్ఛమిత్ర సభ్యులు పాఠశాలలను శుభ్రపర్చాలని ఎంఈవో ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛమిత్ర సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమిత్ర సభ్యులు పాఠశాల తరగతి గదులు, ఆవరణాన్ని, మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాలల్లో ఎక్కడా నీళ్లు నిల్వలేకుండా చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ ఎన్‌వీహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ దీపిక పరిసరాలను వినియోగించి శుభ్ర పరిచే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీవీ.రామారావు, బండి రాము, సీఆర్‌పీలు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమవుతున్న దృష్ట్యా హెచ్‌ఎంలకు కాంప్లెక్స్ స్థాయిలో బుధవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి రిసోర్సు పర్సన్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కూరాకుల సైదయ్య వ్యవహరించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగేశ్వరావు, గోపి వెంకటప్పయ్య, హతిరామ్, రామచంద్, వెంకటేశ్వర్లు, నిర్మల్‌కుమార్ రామకృష్ణ, చంద్రిక, మాధవి, దివ్య, వెంకటేశ్వరరావు, వంట సిబ్బంది నిర్మల, యశోద, మంగమ్మ, కమల, నాగమణి, సైదాబీ, రేణుక, జ్యోతి, విజయ , మరియమ్మ, వెంకటరత్నం బుజ్జి. సీఆర్పీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

బోనకల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నకిలీ విత్తనాలను అరికట్టాలని, పంటల బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రైతుసంఘం డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం. రమాదేవికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుళ్లూరి రమేష్, కొమ్మినేని నాగేశ్వరరావు, దొండపాటి సత్యనారాయణ, రమేష్, పాపారావు, ప్రసాద్, ఏసుపోగు బాబు పాల్గొన్నారు.

ఎరువులను తగిన మోతాదులో వేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త హేమంత్‌కుమార్

సత్తుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధికంగా వాడకుండా రైతులు వ్యవసాయ సాగు చేస్తే రైతుకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ హేమంత్‌కుమార్, మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. సత్తుపల్లి మండలంలోని సదాశివునిపాలెంలో బుధవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ వినుకొండ కృష్ణలు ప్రసంగిస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆశాజ్యోతి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల కమిటీ ఎన్నిక

బోనకల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో బుధవారం నూతన మున్నూరు కాపు నూతన మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సాధం కొండలు, కార్యదర్శిగా నర్సింగుశెట్టి నరేష్, ఉపాధ్యక్షుడిగా మేకల శరత్, సహాయ కార్యదర్శిగా నిమ్మల ఉపేందర్‌రావు, కోశాధికారిగా మురళి, పాశం రాములతో పాటు మండల మహిళా అధ్యక్షురాలిగా మాదవశెట్టి రాధ, కార్యదర్శిగా ధర్మపురి స్వరూపలను ఎన్నుకున్నారు.